- ఈ నెల 5 నుంచి 6 రోజులపాటు ఉత్సవాలు
- కాగ్నా నది ఒడ్డున దోర్నాల్, స్టేషన్ ధారూరు గ్రామాల మధ్య కార్యక్రమాలు
- ఇద్దరితో ప్రారంభమై.. నేడు లక్షల్లో తరలివస్తున్న యాత్రికులు
- దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున జనం
- వికారాబాద్ జిల్లా ధారూరులో అతి పెద్ద క్రైస్తవ జాతర


కాగ్నా నది ఒడ్డున ప్రార్థనా స్థలంలో ఇప్పచెట్టు ఆనవాళ్లు

వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలో గత 100 సంవత్సరాలుగా క్రిస్టియన్ మెథడిస్ట్ జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో మెథడిస్ట్ జాతర ఉత్సవాలకు పెద్ద ఎత్తున యాత్రికులు లక్షలాదిగా తరలివస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి పునీతులవుతారనే నానుడి ఉంది. సుమారు 10 దశాబ్దాలుగా ధారూరు మండల పరిధిలోని స్టేషన్ ధారూరు, దోర్నాల్ గ్రామాల మధ్య గల కాగ్నా నది ఒడ్డున జరిగే మెథడిస్ట్ ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రం నుంచే కాక దక్షిణాది రాష్ట్రాల నుంచి క్రైస్తవులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. మెథడిస్ట్ ఇండియా కమిటీ కార్యకలాపాలు ప్రధానంగా బెంగుళూరు కేంద్రంగా కొనసాగుతాయి. మెథడిస్ట్ పేరున ఉన్న క్రైస్తవులు వికారాబాద్ పేర కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బిషప్‌ల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతాయి. - ధారూరు, డిసెంబర్ 2

# 101వ మెథడిస్ట్ జాతర

ఉత్సవాల సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే రెండు రోజుల పాటు ప్రత్యేక రైళ్లను నడుపనున్నది. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతారు. లక్షలాదిగా తరలివచ్చే యాత్రికులు తాము కోరుకున్న కోరికలు నెరవేరడంతో కానుకలు సమర్పించుకుంటారు. కాలినడకన కూడా చాలా మంది ఇక్కడికి చేరుకుంటారు. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయడమే కాకుండా యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వందేండ్లు పూర్తి చేసుకున్న మెథడిస్టు జాతరకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. కరోనా కారణంగా 2020, 2021లో వేడుకలు నిర్వహించలేదు. ప్రతి ఏటా నవంబర్‌లో జాతర కొనసాగుతుండేది, ఈ సంవత్సరం తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున డిసెంబర్‌కు మార్చారు. సుమారు 35 ఎకరాల స్థలంలో కాగ్నా నది పక్కన ఈ నెల 5 నుంచి ఆరు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సుధారాణి, సంబంధిత మండల స్థాయి అధికారులు, డివిజనల్ స్థాయి అధికారులతో పలు దఫాలుగా సమావేశాలు ఏర్పాటు చేసి తగు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కంటే ఈసారి నిర్వహించే ఉత్సవాలకు పటిష్ట బందోబస్తుతో పాటు యాత్రికులకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించారు.


ప్రార్థన నిర్వహించే స్థలం


మెథడిస్టు జాతర ముఖద్వారం సమీపంలో ఏసుక్రీస్తు శిల్ప


యాత్రికుల కోసం మంచినీటి ట్యాంకు

## మెథడిస్టు జాతరకు ప్రభుత్వ ఏర్పాట్లు

ఈ నెల 5న మంగళవారం నుంచి 10 ఆదివారం వరకు జరిగే జాతరకు ప్రతిఏటా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. 101 మెథడిస్టు జాతరకు ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు, యాత్రికులు వచ్చే అవకాశాలుండడంతో జాతర ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టనున్నారు. జాతర ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిఘా పెంచనున్నారు. జిల్లా అధికారుల ఆధ్వర్యంలో కాగ్నా నదిపై ఉన్న పాత వంతెనను తొలగించి కొత్త వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. తాత్కాలికంగా పైపులు వేసి, మట్టిపోసి వంతెనను ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. జాతర ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాలగదులు, ఫ్లడ్‌లైట్లు, చెత్తకుండీలు, మెడికల్ క్యాంపు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. జాతర సమయంలో ధారూరు, బీదర్ మధ్య ప్రత్యేక రైలును నడిపిస్తారు. హైదరాబాద్-ముంబై వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ధారూరు స్టేషన్‌లో అపుతారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జాతర ప్రాంగణం వరకు ఆర్టీసీ బస్సులు నడిపిస్తారు.

## ధారూరు మెథడిస్టు చర్చిలో ప్రత్యేక ఉత్సవాలు

ధారూరు మెథడిస్టు జాతర ఉత్సవాల్లో ఏసు కీర్తనలు, భజనలు, ప్రార్థనలు నిర్వహిస్తారు. జాతర ప్రాంగణంలో జాతర ప్రారంభం నుంచి ఆరు రోజుల పాటు క్రీస్తు శిలువ వద్ద నిత్యం ప్రార్థనలు కొనసాగుతాయి. జాతరకు వచ్చిన ప్రతి భక్తుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హుండీల్లో బంగారం, వెండితో పాటు నగదు, విలువైన వస్తువులు ప్రభువుకు సమర్పిస్తారు. చాలా మంది గొర్రెలు, మేకలు, కోళ్లు, గోవులను దానంగా నిర్వాహకులకు అందజేస్తారు.


ఏర్పాటు చేసిన చెత్తకుండీలు


బట్టలు ఉతకడానికి అనువుగా పక్కనే ఉన్న చెక్‌డ్యామ్

## మెథడిస్ట్ చరిత్ర

1921లో బీదర్ నుంచి హైదరాబాద్ ప్రయాణిస్తున్న రైలులో ఇద్దరు క్రైస్తవులు హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో ధారూరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న రైలు సాంకేతిక కారణాలతో మూడు గంటలు ఆలస్యమవుతుందని రైల్వే అధికారుల ద్వారా తెలుసుకున్నారు. దీంతో ప్రయాణికుల్లో ఆందోళన మొదలైంది. ఈ సందర్భంగా రెవరెండ్ సీమన్స్ అతని మిత్రుడు జేటీ సీమండ్స్ అనే క్రైస్తవ ప్రయాణికులు పక్కనే ఉన్న కాగ్నా నది ఒడ్డుకు చేరుకుని ఓ ఇప్పచెట్టు కింద కూర్చుని ఏసు నామమున ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు ముగించిన అనంతరం రైలు బయలుదేరుతుందని రైల్వే అధికారులు ప్రకటించారు. సీమన్స్, సీమండ్స్‌లకు చాలా సంతోషం కలిగింది. ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఇప్పచెట్టుకు మరోసారి ప్రార్థనలు చేసి హైదరాబాద్ బయలుదేరివెళ్లారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో తాము వెళ్లిన పని పూర్తి కావడంతో సంతోషించిన మిత్రులిద్దరు కాగ్నా నది ఒడ్డున గల ఇప్ప చెట్టు కింద మహిమ ఉందని, దేవుడు ఉన్నాడని భావించి మరుసటి సంవత్సరం ఏ రోజైతే కాగ్నానది పక్కన ప్రార్థనలు చేశారో అదే రోజున ఆ స్థలాన్ని పవిత్రంగా భావించి ఉత్సవాలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వారు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ప్రారంభమైన మెథడిస్ట్ జాతర నేడు లక్షలాది మందితో ప్రాంగణం కళకళలాడుతున్నది.


జాతర ప్రాంగణంలో దుకాణాల ఏర్పాటు


దోర్నాల్ కాగ్నా నదిపై ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి

# జలమండలికి పీఆర్ఎస్ఐ నేషనల్ అవార్డు

### వరుసగా నాలుగోసారి కైవసం

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ) : జలమండలికి ఈ ఏడాది మరో పురస్కారం లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) నేషనల్ అవార్డు - 2023 జలమండలి గెలుచుకుంది. పీఆర్ఎస్ఐ నిర్వ హించిన ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టివల్ - 2023లో 'కాఫీ టేబుల్ బుక్' కేటగిరీలో రెండో బహుమతి లభించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), ఇతర మల్టీనేషనల్ కంపెనీలతో పోటీపడి అవార్డును దక్కించుకుంది. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం నవంబర్ 27న ఢిల్లీలో జరిగింది. ఈ పురస్కారం రావడంపై మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్ హర్షం వ్యక్తం చేశారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాల యంలో జలమండలి పీఆర్వో సుభాష్ , ఓఎస్టీ పీఆర్వో మనోహ రాచారి పురస్కారాన్ని ఎండీకి శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎండీ దానకిశోర్ వారిని అభినందించారు.

### ఈ ఏడాది వరించిన ఐదు అవార్డులు

గతేడాది సైతం పీఆర్ఎస్ఐ నిర్వహించిన పలు పోటీల్లో జలమండలికి రెండు అవార్డులు దక్కాయి. పలు కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ కమ్యూనికేషన్ క్యాంపెయిన్, ప్రజా అవగాహన విభాగాల్లో జలమండలి మొదటి, మూడో బహుమతి గెలుచుకుంది. జలమండలి పీఆర్ఎస్ నేషనల్ అవార్డు గెలుచుకోవడం వరుసగా నాలుగోసారి కావడం విశేషం. జలమండలి ఈ ఏడాది ఇప్పటికే 4 అవార్డులు గెలుచుకుంది. మార్చి 18న వరల్డ్ వాటర్, మే 1 న ఉత్తమ యాజమాన్య, జులై 5న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), ఆగస్టు 1న గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ-2023 అవార్డులొచ్చాయి. ఈ అవార్డుతో జలమండలి ఈ ఏడాది 5 పురస్కారాల్ని తన ఖాతాలో వేసుకుంది. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ పీఆర్వో మధుసూదన్ పాల్గొన్నారు.

## హైదరాబాద్ నుంచి గోండియాకు
# విమాన సర్వీసు

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) నుంచి గోండియా (రైస్ సిటీ)కు విమాన సర్వీసులను ఇండిగో విమానయాన సంస్థ శనివారం ప్రారంభించింది. తొలి ఇండిగో విమానం 6ఈ7534 హైదరాబాద్ అంతర్జాతీయ విమానశ్రయం నుంచి 10.35 గంటలకు బయలుదేరింది. సర్వీసు బయలుదేరే సందర్భంలో ఇండిగో బృందంతోపాటు జీహెచ్ఐఏఎల్‌కు చెందిన ఉన్నతాధికారులు ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. రోజువారీ విమానం హైదరాబాద్ నుంచి 10.35 గంటలకు బయలుదేరి 12.35 గంటలకు గోండియా చేరుకుంటుంది. రైస్ సిటీ అని కూడా పిలువబడే గోండియాను ఇండిగో ద్వారా సర్వీసు ప్రారంభించడంతో 55 దేశీయ, 14 అంతర్జాతీయ గమ్యస్థానాలకు ప్రయాణికులను చేరవేస్తున్న సంస్థగా గుర్తింపు పొందింది.

# ఐబీఎస్‌లో క్రీడా పోటీలు

### నేటితో ముగియనున్న టోర్నమెంట్

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): మోకిలలోని ఇక్ఫాయ్ హైదరాబాద్ క్యాంపస్‌లో మేనేజ్‌మెంట్ విద్యార్థుల క్రీడా పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. 12 క్రీడాంశాల్లో జరుగుతున్న పోటీలను మూడు రోజుల పాటు నిర్వహిస్తుండగా, మొదటి రోజు పోటీలు పూర్తి కాగా, రెండో రోజు పోటీలు శనివారం క్యాంపస్‌లోని వివిధ మైదానాల్లో విద్యార్థుల కేరింతల మధ్య హోరాహోరీగా సాగాయి. దేశంలోని వివిధ నగరాల్లోని బిజినెస్ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ హైదరాబాద్‌కు చెందిన టీమ్ వ్యాప్స్ ఆధ్వర్యంలో ఆవేగ్ 14 పేరుతో నిర్వహిస్తున్న బిజినెస్ స్కూల్స్ ఇంటర్ స్పోర్ట్స్ టోర్నమెంట్‌కు మీడియా స్పాన్సర్స్‌గా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంస్థలు వ్యవహరిస్తున్నాయి. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో రెండో రోజు 9 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. బాస్కెట్‌బాల్ పోటీల్లో ఐబీఎస్ హైదరాబాద్, ఐపీఈ, వోక్సెన్, వీజేఐఎం విద్యాసంస్థలకు చెందిన బృందాలు మ్యాచ్ విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ క్రీడలో మెన్స్ సింగిల్స్ సెమీఫైనల్‌లో ఐబీఎస్ హైదరాబాద్, ఐపీఈ, ఉమెన్స్ సింగిల్స్ సెమీ ఫైనల్‌లో ఐబీఎస్ హైదరాబాద్, వీజేఐఎంకు చెందిన బృందాలు, ఇక మెన్స్ డబుల్ సెమీ ఫైనల్స్ ఐబీఎస్ హైదరాబాద్, ఐపీఈ బృందాలు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్‌లో ఐపీఈ, ధ్రువ, వోక్సెన్ విజేతలుగా నిలువగా, క్రికెట్‌లో ఐబీఎస్ హైదరాబాద్, ఐబీఎస్ బెంగళూరు, ఐపీఈ, ఐబీఎస్ బెంగళూరు, చెస్‌లో ఫైనల్ మ్యాచ్ విన్నర్‌గా సాత్విక్ బులుసు(ఐపీఈ), రన్నరప్‌గా శరణ్ (ఐబీఎస్), అదే విధంగా వోక్సెన్, ఐపీఈ టీంల మధ్య జరిగిన పుట్‌బాల్‌లో మ్యాచ్ డ్రా అయిందని నిర్వాహకులు తెలిపారు. క్యారమ్ ఫైనల్ మ్యాచ్ విజేతగా జి.కార్తిక్ (వీజేఐఎం), రన్నరప్‌గా టి.హితేశ్ (ఐబీఎస్) నిలిచారు. ఆదివారం జరిగే ఫైనల్ పోటీల అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఇక్ఫాయ్ ఐబీఎస్ హైదరాబాద్ టీమ్ వ్యాప్స్ అధ్యక్షుడు మహి త్యాగి, ఉపాధ్యక్షుడు భాస్కర్ యాదవ్ తెలిపారు.